క్లుప్తంగా

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సత్తెనపల్లి పట్టణ సీఐ పోలూరి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని ఒకటవ వార్డులో శుక్రవారం కేంద్ర బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఎన్నికల్లో కేసులు నమోదైతే భవిష్యత్తులో అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. నిర్భయంగా ఎవరికి వారు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సైలు సత్యనారాయణ, సంధ్యారాణి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వార్షిక బ్రహ్మోత్సవాలు



సత్తెనపల్లి: మండలంలోని నందిగామ గ్రామంలో వేంకటేశ్వర స్వామి 30వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, అఖండ స్థాపన, స్వామివారికి పంచామృతాభిషేకాలు, దశవిధ స్నానములు, అలంకారం, సహస్రనామ పుష్పార్చన, మహా నివేదన చేపట్టారు. భగవద్గీత సమాజం వారిచే విష్ణు, లలిత సహస్రనామ పారాయణం, రాజ్యలక్ష్మి భజన సమాజం, రాజరాజేశ్వరి భజన సమాజం వారిచే సంకీర్తన నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా లక్ష్మీ తిరుపతమ్మ తిరునాళ్ల



బయ్యవరం(క్రోసూరు): క్రోసూరు మండలం బయ్యవరం గ్రామంలో కొలువై ఉన్న లక్ష్మీ తిరుపతమ్మ తల్లి గోపయ్య స్వామి తిరునాళ్ల మహోత్సవ కార్యక్రమంలో పెదకూరపాడు శాసన సభ్యులు నంబూరు శంకరరావు గురువారం రాత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి దయవల్ల నియోజకవర్గంలో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు సమస్యకు పరిష్కారం



సత్తెనపల్లి: పట్టణంలోని రంగాకాలనీ 2వ వార్డు రైలుపేట, 2వ వార్డు సరిహద్దు నుంచి శేఖినా చర్చి మీదుగా అచ్చంపేట రోడ్డు వైపుకు వెళ్ళే రహదారి అస్తవ్యస్తంగా ఉండి ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడటంతో స్థానికులు ఆ సమస్యను వైఎస్సార్‌సీపీ 1వ వార్డు కౌన్సిలర్ వరికల్లు కోటేశ్వరరావు దృష్టికి తీసుకువచ్చారు. ఎప్పటి నుంచో మరుగున పడిన ఆ రోడ్డు సమస్యను సత్వరమే అక్కడి పోస్టల్ కాలనీ అని పిలువబడే ప్రాంతంలోని ఖాళీ స్థలాల యజమానులతో చర్చించి రోడ్డుకి ఇరువైపులా ముగ్గులు వేయించి వార్డు కౌన్సిలర్ కోటేశ్వరరావు చొరవ తీసుకుని తన సొంత నిధులతో రోడ్డును చదును చేయించారు. సుమారు 300 మీటర్లు రోడ్డు రూపురేఖలు తీసుకువచ్చారు. కౌన్సిలర్ కోటేశ్వరరావును పలువురు శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో 1వ వార్డు రంగా కాలనీ సచివాలయం కన్వీనర్ వరికల్లు కోటిలింగం, 1వ వార్డు నాయకులు గూడా శ్రీనివాసరెడ్డి, జడా ప్రసాద్, సయ్యిద్ సత్తార్, స్థానికులు ఉన్నారు.

నేటి నుంచి ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవాలు

రాజుపాలెం: మండలంలోని అకుల గణపవరంలో వేంచేసి ఉన్న ప్రసన్నాంజనేయస్వామి 95వ జయంతి మహోత్సవాలు నేటి (శనివారం) నుంచి సోమవారం వరకు మూడు రోజులు జరుగనున్నాయని దేవదాయ శాఖ ఈవో ఔదూరి వెంకటేశ్వర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. శనివారం లక్ష తమలపాకులతో పూజా కార్యక్రమాలు జరుగును. సాయంత్రం వేళల్లో డప్పు వాయిద్యాలతో స్వామి వారి గ్రామోత్సవం జరుగును. 31వ తేదీన జిల్లా స్థాయిలో భజన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ఇవ్వబడును. 1వ తేదీన వసంతోత్సవం జరుగును. ప్రతి రోజు సాయంత్రం వేళల్లో భజన కార్యక్రమాలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడునని తెలిపారు.

క్రీస్తు బోధనలను ఆచరించాలి

- పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు



క్రీస్తు మార్గంలో శిలువ మోస్తున్న క్రీస్తు ఆరాధకులు

అమరావతి: ఈ లోకంలో పాపకర్ములను శిక్షించకుండా వారు చేసిన పాపాన్ని పరిహరించటానికి ఏసుక్రీస్తు సిలువపై శిక్షింపబడ్డాడని ఫాదర్ గంగోలు భాస్కర్ అన్నారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా స్థానిక పల్లోటి చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఏసు బోధనలను వివరించారు. క్రీస్తు బోధనలలోని కరుణ, సాత్వికత్వం, ప్రేమ, క్షమాపణ, పశ్చాత్తాపం వంటి విలువలు అందరూ కలిగి ఉండాలన్నారు. ప్రతివారు పొరుగువారిపై దయ కలిగి ఆధ్యాత్మిక జీవనాన్ని సాగించాలన్నారు. క్రీస్తు మానవుని పాపాలను హరించి సన్మార్గంలో జీవించేటట్లు చేయటానికి సిలువపై పడిన బాధలను వివరించారు. ఉపవాస దీక్షలు ఆచరించే వారు దీక్ష విరమణ అనంతరం కూడా సన్మార్గంలో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులతో సిలువ మార్గం తొలుత పల్లోటి చర్చి వద్ద నుంచి ప్రారంభమై బస్టాండ్ సెంటర్, మద్దూరురోడ్ సెంటర్, గాంధీబొమ్మ సెంటర్, క్రోసూరు రోడ్డు మీదుగా తిరిగి చర్చివద్దకు చేరింది. 14స్థానాలలో దేవుని వాక్యాన్ని చదివి క్రీస్తు ఆరాధకులకు వినిపించారు. క్రీస్తు ఆరాధకులు సిలువ మోయటానికి పోటీ పడ్డారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల చర్చిలలో గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ధరణికోట లూథరన్‌లో పాస్టర్ రెవరెండ్ సత్యానంద్‌కుమార్ ఆధ్వర్యంలో భక్తులు, సంఘ పెద్దలు సువార్త నామాన్ని జపిస్తూ విశ్వాసులు, ఏసు దీక్షాపరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

అచ్చంపేట: గుడ్ ఫ్రైడే సందర్భంగా మండలంలోని పలు గ్రామాలలోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిలను అందంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. మండలంలోని తాళ్లచెరువు పురవీధులలో ఫాదర్ పుట్టి అంతోనిరాజు, ఫాదర్ కిరణ్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన పరిశుద్ధ సిలువ మార్గం భక్తిరస ప్రదర్శన గ్రామస్తులను ఆకట్టుకుంది. ఏసుక్రీస్తు సిలువను మోస్తూ తాళ్లచెరువు పురవీధులలో వెళుతుండగా సైనికులు కొరడాలతో కొట్టడం, అనంతరం ఏసుక్రీస్తును సిలువ వేయడం వంటి దృశ్యాలు భక్తులను కళ్ల నీళ్లు తెప్పించాయి. బాలయేసు మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ యేసు మార్గంలో నడవాలని, ఇక నుంచైనా చెడుమార్గాలను వీడి మంచి మార్గంలో నడవాలని, దయ, క్షమాగుణం కలిగి ఉండాలని బోధించారు.

నకరికల్లులో ఘనంగా గుడ్ ఫ్రైడే

నకరికల్లు: త్యాగానికి ప్రతీకగా జరుపుకునే గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని క్రైస్తవులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తుకు సిలువ వేసిన రోజు కావడంతో శాంతి ప్రార్థనలు చేశారు. దేవుని కుమారునిగా భూలోకానికి వచ్చిన ఏసుక్రీస్తు శుక్రవారం నాడు సిలువ వేయబడి ఆదివారం రోజు తిరిగి పునరుజ్జీవనం పొందారని క్రైస్తవులు విశ్వసిస్తారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని చర్చిలలో పెద్దసంఖ్యలో ప్రార్థనలు చేశారు.

రాజుపాలెంలో ఘనంగా గుడ్ ఫ్రైడే

రాజుపాలెం: ప్రభువైన ఏసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటల గురించి సంఘ కాపరి ఎ.మత్తయ్య వివరించారు. మండలంలోని అన్ని చర్చిలలో గుడ్ ఫ్రైడే ఘనంగా నిర్వహించారు. రాజుపాలెం, అనుపాలెంలోని పరిశుద్ధ మత్తయ్య లూథరన్ చర్చిలలో, సంఘ కాపరి ఎ.మత్తయ్య క్రీస్తు బోధనల గురించి వివరించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. సంఘస్తులు ఏడు మాటలలో పాలు పంచుకుని, ధ్యానించారు. ప్రతి ఒక్కరు క్షమాగుణం కలిగి ఉండాలని, క్రీస్తు బాటలో నడవాలని సూచించారు.



పట్టణంలోని సీయోన్ లూథరన్ చర్చిలో క్రైస్తవులు

ముప్పాళ్ళలో ఘనంగా గుడ్ ఫ్రైడే

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లోను గుడ్ ఫ్రైడే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. క్రీస్తును కొరడాలతో కొట్టి, ముళ్ళ కిరీటం పెట్టి, సిలువపై వేలాడదీసిన రోజును క్రైస్తవులు గుడ్ ఫ్రైడేగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా చర్చిలలో సామూహిక ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. సిలువపై క్రీస్తు పలికిన ఏడు మాటలు గురించి సంఘ కాపరులు వివరించారు. చర్చి ఆవరణలో బెల్లంతో కలిపిన పానకాన్ని అందించి ఉపవాస దీక్షను విరమిస్తారు. ఆయా గ్రామాల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో చిన్నారులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



తాళ్లచెరువులో సిలువను మోస్తూ ప్రదర్శించిన ఘట్టంలో పెద్దఎత్తున తరలి వచ్చిన భక్తులు



రాజుపాలెంలో ప్రార్థనలు నిర్వహిస్తున్న సంఘకాపరి

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు

సత్తెనపల్లి: గుడ్ ఫ్రైడే పురస్కరించుకొని పట్టణం, మండలంలోని అన్ని చర్చిల్లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా చర్చిల్లో పాస్టర్లు మాట్లాడుతూ ఈ శుక్రవారం నాడే కల్వరిగిరిపై క్రీస్తును సిలువపై శిక్షించారన్నారు. ప్రాణత్యాగ సమయంలో కూడా క్రీస్తు తనకు మరణశిక్షను అమలు చేస్తున్న రోమ సైనికుల కోసం లోక రక్షకుడైన తన తండ్రితో 'తండ్రి వీరు ఏమి చేస్తున్నారో ఎరుగరు... వీరిని క్షమింపుము' అని ప్రార్థించారన్నారు. తన దయ, కరుణ తత్వాలను లోకానికి చాటారన్నారు. సిలువపై మరణిస్తున్న సమయంలో ఆయన చెప్పిన ఏడు సూక్తులు లోకానికి ఆరాధ్యాలయ్యాయన్నారు. మానవుల పాప నివారణకు ఏసుక్రీస్తు సిలువపై మరణించిన రోజు గుడ్ ఫ్రైడే అని, ఇది ఓ మహోన్నతమైన రోజన్నారు. ఏసుక్రీస్తు నందు విశ్వాసం ఉంచిన వారు పాపముల నుంచి విముక్తి పొంది నిత్యజీవము పొందుతారన్నారు. ఆయా కార్యక్రమాలల్లో సంఘ కాపరులు, సంఘ పెద్దలు, క్రైస్తవులు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం



బూతుకూరి శారదా వాణి



గుర్రాల షేక్ కరీముల్లా

బెల్లంకొండ: మండల వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ కేంద్ర కార్యాలయం నుంచి మండలంలోని పలువురికి నియామక పత్రాలు అందాయి. మండల బీసీ సెల్ అధ్యక్షుడిగా వన్నాయపాలెం గ్రామానికి చెందిన గమిడి కోటినాగయ్య, మండల మైనార్టీ సెల్ అధ్యక్షునిగా బెల్లంకొండకు చెందిన గుర్రాల షేక్ కరీముల్లా (బడా బచ్చా), మహిళా విభాగం అధ్యక్షురాలిగా నందిరాజుపాలెం గ్రామానికి చెందిన బూతుకూరి శారదావాణి, ఎస్సీ సెల్ అధ్యక్షునిగా బెల్లంకొండకు చెందిన చావలి పెద వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీకి పనిచేసిన తమకు పార్టీ గుర్తింపు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ విజయానికి తమ వంతు కృషి చేస్తామని, అనుబంధ విభాగాల ద్వారా పార్టీని పటిష్టం చేస్తామన్నారు. తమ నియామకానికి కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు, ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మ, వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ గాదె వెంకటరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఓర్చు సాంబశివరావులకు కృతజ్ఞతలు తెలిపారు.



గమిడి కోటినాగయ్య



చావలి పెద వెంకటేశ్వర్లు

కట్టావారిపాలెం అభివృద్ధి నా బాధ్యత

మంత్రి అంబటి రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: కట్టావారిపాలెం అభివృద్ధి నా వ్యక్తిగతమైన బాధ్యతగా తీసుకొని ప్రతి విషయంలోను మీకు అండగా ఉంటానని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో సత్తెనపల్లి మండల కట్టావారిపాలెం గ్రామ ముఖ్య నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామంలో సంక్షేమం, అభివృద్ధి కలిపి రూ.15.63 కోట్ల నిధులు ఖర్చు చేశామన్నారు. అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. ఇంత అభివృద్ధిని గతంలో ఏ ప్రభుత్వం, ఏ పార్టీ చేయలేదని వివరించారు. రానున్న ఎన్నికలు చాలా ముఖ్యమైనవని, చాలా కీలకమని, పేదల తలరాతలు మార్చేవన్నారు. నియోజకవర్గంలో పారదర్శకమైన పాలన చేశానని, ఏ వర్గానికి ఇబ్బంది లేకుండా ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించానన్నారు. క్షేత్రస్థాయి నుంచి ప్రతి కార్యకర్త, నాయకుడు చిత్తశుద్ధితో ఎన్నికల నిర్వహణలో భాగసామ్యం కావాలన్నారు. ఏ అవసరం వచ్చినా మీకు అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాయపాటి పురుషోత్తమరావు, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యులు కళ్ళం విజయభాస్కరరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలుకా జయపాల్, మండల పార్టీ నాయకులు జంగా చంద్రశేఖరరెడ్డి, సంకటి శాంసన్, కొమెరపూడి సర్పంచ్ కొరివి అనిల్‌కుమార్, కట్టావారిపాలెం వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన బాజీ



సత్తెనపల్లి: పట్టణంలోని 29వ వార్డుకు చెందిన టీడీపీ నాయకుడు షేక్ బాజీ(ఫైనాన్స్)ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరగా ఆయనకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగుర్‌మీరాన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు షేక్ నాగుల్‌బాషా, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పేదలకు న్యాయం చేస్తున్న వైఎస్సార్‌సీపీ



పెదకూరపాడు(అమరావతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తూ న్యాయం చేస్తున్నందు వల్లే వైఎస్సార్‌సీపీలో చేరుతున్నానని టీడీపీ కార్యకర్త వడ్లమూడి చెంచయ్య అన్నారు. గురువారం రాత్రి నియోజకవర్గ మహిళా నాయకురాలు వసంత కుమారి మండల కేంద్రం పెదకూరపాడులో నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారంలో చెంచయ్యకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, మండల పార్టీ అధ్యక్షుడు మస్తాన్‌షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రామాలయం ప్రతిష్టా మహోత్సవం

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో రామాలయం దేవస్థానం ప్రతిష్టా మహోత్సవం ఈ నెల 30వ తేదీన జరుగుతుందని ఆలయ నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో స్వామి వారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవంతో పాటు అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. భక్తులు ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

రంజాన్ ఉపవాసం.. పరమ పవిత్రం

- నిగ్రహంతో కూడిన ఆధ్యాత్మిక చింతనే ఉపవాస దీక్ష
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులతో మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ఆచరించే ఉపవాసం నిర్దిష్ట నియమాలతో కూడుకున్న జీవన విధానమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని 2వ వార్డు రంగా కాలనీలోని రిటైర్డ్ రైల్వే ఉద్యోగి జాన్‌పీరా ఇంటిలో, 29 వార్డులోని షేక్ బాజీ సోదరి గృహంలో శుక్రవారం జరిగిన ఇఫ్తార్ విందుల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ముస్లిం సోదరులను, ప్రతి కార్యకర్తనూ పలకరిస్తూ స్వయంగా ఆహారం వడ్డించారు. ఇఫ్తార్ విందుకు పట్టణంలో ముస్లిం సోదరులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ముందుగా ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలియ జేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైఎస్ చైర్మన్ షేక్ నాగుర్‌మీరాన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు షేక్ నాగుల్‌బాషా, నాయకులు హుసేనా మేస్త్రీ, షఫీ మేస్త్రీ, చాంద్, ఖాజావలి, ఖాశిం, కరీముల్లా, ముస్లిం మత పెద్దలు ఖలీల్, సైదుహుస్సేన్, మహిబుల్లా, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల బాధ్యులు, స్థానిక నాయకులు ఉన్నారు.

సంక్షేమాభివృద్ధితోనే మళ్లీ విజయం సాధిస్తాం



వైఎస్సార్‌సీపీలో చేరిన కోనూరు టీడీపీకి చెందిన 11 కుటుంబాలు

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: కొనసాగుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుతోనే రాష్ట్రంలో 175 అసెంబ్లీ, 25 పార్లమెంటు సీట్లు సాధిస్తామని, మళ్లీ జగనన్న సీఎం అవుతారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని కోనూరు, తాడువాయి గ్రామాలలో గురువారం రాత్రి భారీ సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. కోనూరులో... టీడీపీకి చెందిన 11 కుటుంబాల వారు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారిలో జూపల్లి శివనగేష్, వెంకయ్య, ఏసుదాసు, శివనాగరాజు, సరోజిని, రోజా, కోటేశ్వరమ్మ, నాగబాబు, సాంబయ్య, గంగాధర్‌రావు, సుధాకర్‌బాబులకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ రోజు నుంచి తాము వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులమని, శంకరరావు గెలుపుకు అహర్నిశలు కృషి చేస్తామని చెప్పారు. ఎంపీటీసీ యండ్రపల్లి నటరాజు, మాజీ సర్పంచ్ వాశిరెడ్డి వెంకటేశ్వరరావు, పార్టీ కన్వీనర్ పాగోళ్ల శ్రీనివాసరావు, మత్సా శ్రీనివాసరావు, పసుపులేటి జనార్ధన్, రావెళ్ల శ్రీధర్ పాల్గొన్నారు.



తాడువాయిలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ ప్రముఖ నాయకులు

తాడువాయిలో... ప్రముఖ టీడీపీ నాయకులు బయ్యారపు నరసింహారావు, బాణావతు హరినాయక్‌లు టీడీపీకి గుడ్‌బై చెప్పి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. రాబోయే ఎన్నికలలో వైఎస్సార్‌సీపీని అఖండ మెజార్టీతో గెలిపించుకుంటామని, మళ్లీ ఎమ్మెల్యేగా నంబూరు శంకరరావును, ఎంపీగా అనిల్‌కుమార్ యాదవ్‌ను గెలిపించుకుని సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా అందిస్తామన్నారు. జెడ్పీటీసీ విజయ ప్రతాప్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, లిడ్‌క్యాప్ డైరెక్టర్ ఎక్కిరాల మురళి, గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

14వ మైల్‌లో పోలీసు తనిఖీలు



అమరావతి: మండల పరిధిలోని పల్నాడు, గుంటూరు జిల్లాల సరిహద్దు అయిన 14వ మైల్‌లో ఎన్నికల విధులలో భాగంగా పోలీసు సిబ్బందితో సీఐ ఎ.వి.బ్రహ్మం ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ బ్రహ్మం మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ఆయుధాలు, ఆధారాలు లేని నగదు, మద్యం తరలించకుండా 14వ మైల్‌లో చెక్‌పోస్టు ఏర్పాటు చేశామన్నారు. వాహనదారులు పోలీసులకు సహకరించాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడంలో భాగంగానే చెక్‌పోస్టు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నామన్నారు.

క్రీస్తు మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలి

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



గుడ్‌ఫ్రైడే ప్రార్థనల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



క్రోసూరు లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: గుడ్ ఫ్రైడే పండుగ మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రార్థనా మందిరాలు, చర్చిల్లో క్రైస్తవులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. క్రోసూరులోని లూథరన్ చర్చిలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి ఫాదర్ డాక్టర్ ఎం.సుందరరావు దేవుని వాక్యములు చదివి ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఏసుక్రీస్తు చూపిన మార్గంలో నడవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, సంఘ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

గుడ్ ఫ్రైడే ప్రార్థనల్లో ఎమ్మెల్యే నంబూరు..

పెదకూరపాడు(అమరావతి): స్థానిక సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో నిర్వహించిన గుడ్ ఫ్రైడే వేడుకలలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మానవాళి పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ చూపటమే క్రీస్తు జీవితం మనకు నేర్పిన పరమార్థమన్నారు. క్రీస్తు త్యాగానికి గుర్తుగా గుడ్ ఫ్రైడే జరుపుకుంటామన్నారు. ప్రపంచ మానవాళిని పాపముల నుంచి రక్షించటానికి భూలోకంలో క్రీస్తు అవతరించాడన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, మండ పార్టీ అధక్షుడు మస్తాన్‌షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి జగనన్నను గెలిపిద్దాం



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నంబూరు వసంతకుమారి తదితరులు

పెదకూరపాడు(అమరావతి): ఐదేళ్ల సుపరిపాలనలో అన్ని వర్గాల పేదలకు లబ్ధి చేకూరిందని, సంక్షేమ పథకాలను అమలు చేసిన పేదల సంక్షేమ సారథి జగనన్నను మరొక్కసారి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకురాలు నంబూరు వసంత కుమారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం పెదకూరపాడులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు జగనన్న పాలనలో లబ్ధి చేకూరిందన్నారు. పేదలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కోలేక టీడీపీ, జనసేన, బీజేపీ అక్రమ పొత్తులు పెట్టుకుని అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసేందుకు వస్తున్న వారిని ప్రజలే తరిమి కొట్టే రోజు దగ్గరలో ఉందన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. పెదకూరపాడు ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలతో పాటు మెయిన్‌బజార్‌లో ఇంటింటికి తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యాలని కోరారు. ఆమె వెంట మండల పరిషత్ అధ్యక్షుడు బెల్లంకొండ మీరయ్య, మండల పార్టీ అధ్యక్షుడు మస్తాన్‌షరీఫ్ తదితరులు ఉన్నారు.

కనుల పండువగా శాంతి కల్యాణం



రెంటచింతల: స్థానిక సుబ్బన్నతోట కాలనీలోని అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం 20వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం స్వామివారి శాంతి కల్యాణ మహోత్సవం కనులపండువగా నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ ఓరుగంటి మారుతీశర్మ ఆధ్వర్యంలో యాజ్ఞిక స్వాములు జిగురు చంద్రశేఖర్ శర్మ, లక్ష్మీ శివప్రసాద్ శర్మ, శంకర్ శర్మ నేతృత్వంలో స్వామివారికి ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, 6.30 గంటలకు పుష్పాభిషేకం, సహస్రనామార్చన, 8 గంటలకు సుదర్శనహోమం, స్వామి అమ్మవార్లకు ఎదురుకోల మహోత్సవం, 11 గంటలకు శాంతి కల్యాణం వైభవంగా జరిపించారు. భక్తులకు మహా అన్నదానం చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించి బ్రహ్మయ్యబావి సెంటర్ వద్ద లడ్డు (1 గ్రాము బంగారు లాకెట్)కు వేలం పాట నిర్వహించారు. దేవాలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలతో అలంకరించారు. దేవస్థానం చైర్మన్ నాళం పెదబాబు, పాలక వర్గ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.